
సాక్షి తిరుపతి

మంగళవారం । 18 । జూన్ । 2024



వంటింట్లో కటకట

కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. - 8లో



19 నుంచి పోలేరమ్మ జాతర

వెంకటగిరిలోని బంగారుపేట పోలేరమ్మ జాతర ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. - 8లో



రాజీనామా

చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్, సభ్యులు రాజీనామా చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పీఎం కిసాన్ రూ.2 వేలు జమ

జిల్లాలో 1,89,209 మంది రైతుల ఎంపిక

తిరుపతి అర్బన్: రైతుల పెట్టుబడిగా ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత పీఎం కిసాన్ రూ.2వేలు మంగళవారం జమకానుంది. జిల్లాలో మొత్తం 1,89,209 మంది రైతులకుగాను రూ.495.31 లక్షలు జమకానుంది. పీఎం కిసాన్ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ కేంద్రం వద్ద సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పెంచలకోనలో చిన్నజీయర్‌స్వామి



ఆలయంలో చిన్నజీయర్‌స్వామి

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని సోమవారం త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్‌స్వామి దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి,అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామీజీకి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో డీసీ సాగర్‌బాబు, దేవస్థాన ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి పాల్గొన్నారు.

నిలకడగా నిమ్మ ధరలు



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సైదాపురం: గతేడాదితో పోల్చి చూస్తే ఈసారి నిమ్మ ధరలు నిలకడగా ఉన్నాయి. ఈ ఏడాది దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే ఉన్నట్లు రైతులు వెల్లడించారు. ప్రస్తుతం కిలో నిమ్మకాయలు రూ.40 నుంచి రూ.65 ధర పలుకుతున్నాయి. వేసవిలో నిమ్మకాయలకు ఎక్కువగా డిమాండ్ ఉన్నా ధరలు పెరగలేదని రైతులు చెబుతున్నారు. ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



భక్తులకు కోడి ముద్దలు పంపిణీ చేస్తున్న అర్చకులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సోమవారం ఉదయం ధ్వజారోహణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధ్వజస్తంభానికి హనుమంతుని చిత్ర పటాన్ని ఎగురవేశారు. అనంతరం భక్తులకు కోడి ముద్దలు అందజేశారు. వాటిని పొందేందుకు భక్తులు పోటీ పడ్డారు. తర్వాత స్వామి వారిని శేష వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.



శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

నేత్రపర్వం.. తెప్పోత్సవం





తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని అలంకరణలో పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

– చంద్రగిరి

భక్తి శ్రద్ధలతో బక్రీద్



ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు



తిరుపతి ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తిరుపతి కల్చరల్: బక్రీద్ వేడుకలను ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, నగరి, పుత్తూరు, చంద్రగిరి, పాకాల వంటి ప్రాంతాల్లో బక్రీద్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఈద్గా, దర్గాలతో పాటు మసీదుల్లో సామూహిక ప్రార్థనలకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే ముస్లింలు ఈద్గా, దర్గాలకు చేరుకుని ఒకరినొకరు ఆలింగనంతో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు, ముతవల్లి ఆధ్వర్యంలో నమాజ్ చేపట్టారు. దానధర్మాలు చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఆరగించారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

ముక్కంటి ఆలయం కిటకిట

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వారాంతపు సెలవులు, వరుస సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి భక్తులతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 38 వేల మంది తరలివచ్చారు. ఇందులో భాగంగా రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 5,680 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 3,050 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు–కేతుపూజలకు 3,631 మంది, రూ.750 పూజలకు 1,869, రూ.1,500 పూజలకు 597, రూ.2,500 పూజలకు 393, రూ.5 వేల పూజలకు 98 మంది భక్తులు పాల్గొన్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,159 విక్రయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయం వద్ద నిరీక్షిస్తున్న భక్తులు

దర్యాప్తులో అలసత్వం వద్దు

తిరుపతి క్రైమ్: కేసుల దర్యాప్తు విషయంలో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. సోమవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గ్రేవ్ కేసుల పురోగతిపై ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. పెండింగ్ గల కారణాలను, గణాంకాలను, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మెలకువలను, అరెస్టుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో ఏఎస్పీ వెంకట్రావు, కులశేఖర్, డీఎస్పీలు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అడ్మిషన్లకు యూనివర్సిటీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి ర్యాంకు కార్డులను సైతం విద్యార్థులకు అందించింది. ఈనెల చివరి వారంలో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. జూలై మొదటి వారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌తోపాటు పద్మావతి మహిళా వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ రెండు యూనివర్సిటీలలో వంద శాతం కన్వీనర్ కోటాలోనే సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది.





ఇంజినీర్లుగా రాణిద్దాం రండి!

కౌన్సెలింగ్‌కు కావాల్సిన ధ్రువపత్రాలు

- ఏపీ ఈఏపీసెట్–2024 ర్యాంకు కార్డు
- ఏపీ ఈఏపీసెట్–2024 హాల్ టికెట్
- ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష మార్కుల జాబితా
- పుట్టిన తేదీ ధ్రువపత్రం కోసం ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా
- బదిలీ సర్టిఫికెట్ (టీసీ)
- స్టడీ సర్టిఫికెట్స్ 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు
- ఆర్థికంగా వెనుకబడిన వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్–2025 వ్యాలిడిటీ (ఓసీ విద్యార్థులు)
- కుల ధ్రువీకరణ పత్రం (బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు
- పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు

ఇంజినీరింగ్ అడ్మిషన్లకు రెడీ

- బ్రాంచ్ ఎంపిక, వెబ్ ఆప్షన్ల విషయంలో జాగ్రత్త
- జూలై మొదటి వారంలోనే కౌన్సెలింగ్
- ఎస్వీయూలో ఆరు బ్రాంచ్‌లు.. 396 సీట్లు
- మహిళా వర్సిటీలో నాలుగు బ్రాంచ్‌లు... 396 సీట్లు
- ఆ రెండు ఇంజినీరింగ్ కళాశాలల్లో 70 శాతం ప్లేస్‌మెంట్స్
- రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్ కళాశాల

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ర్యాంక్ కార్డుల ఆధారంగా సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. బీటెక్‌లో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ ద్వారా తమకు నచ్చిన బ్రాంచ్‌ని, కళాశాలను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇస్తుంది. ఈనెల చివరి వారంలో అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముందుగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాల్సి ఉంటుంది. వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ప్రధానంగా బ్రాంచ్ ఎంపికలోనూ కచ్చితమైన నిర్ధారణకు రావాలి. ఫలానా బ్రాంచ్ తీసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయంటూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే బ్రాంచ్‌ని ఎంపిక చేసుకుని తమకు నచ్చిన ఒకే కళాశాలను ఆప్షన్లలో ఉంచితే అంతే సంగతులు. తాము ఎంపిక చేసుకున్న బ్రాంచ్ కోసం 50 నుంచి 70 కళాశాలలను ఆప్షన్లలో ఉంచాలి. ఐదు వేల ర్యాంకు పైబడిన వారు మొదటి దశ కౌన్సెలింగ్‌లోనే 50కి మించి కళాశాలల్లో సీటు కోసం ఆప్షన్లు పెట్టాలి. లక్ష వరకు ర్యాంకు వచ్చిన విద్యార్థులు సైతం వెబ్ ఆప్షన్లలో అధిక సంఖ్యలో కళాశాలలను ఎంపిక చేసుకోవాలి. ఒక్క బ్రాంచ్‌పై ఆధార పడకుండా కనీసం రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్రాంచ్‌లను ఎంచుకోవాలి.

అటానమస్ కళాశాలల్లో పెరగనున్న సీట్లు

ఏపీ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు సాధించలేకపోయామనే ఆలోచన అవసరం లేదు. ఈ ఏడాది ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎత్తివేసింది. దీంతో అటానమస్ కళాశాలలు అదనపు సెక్షన్లను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు పొందాయి. అన్ని బ్రాంచ్‌లలో సీట్లు భారీగా పెరగనున్నాయి. ఏపీ ఈఏపీసెట్‌లో పెద్ద ర్యాంక్ వచ్చినా విద్యార్థులు ఏదో ఒక కళాశాలలో తమకు నచ్చిన బ్రాంచ్‌లో కన్వీనర్ కోటాలోనే ఫ్రీ సీటు సాధించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తిరుపతి

రాష్ట్రంలోనే ఏకైక మహిళా ఇంజినీరింగ్ కళాశాల

పద్మావతి మహిళా వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళలకు ప్రత్యేకంగా నెలకొల్పబడిన ఏకైక ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్ కాలేజ్. ఇందులో కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో మాత్రమే అడ్మిషన్లు స్వీకరిస్తారు. ఇందులో సీఎస్ఈ, ఈసీఈలో 120 సీట్లు ఉండగా మరో 10 శాతం సీట్లు ఈడబ్ల్యూఎస్ కింద భర్తీ చేస్తారు. అదేవిధంగా ఈఈఈ, మెకానికల్ బ్రాంచ్‌లలో 60 సీట్లు మాత్రమే ఉండగా మరో 10 శాతం అంటే అదనంగా ఒక్కో బ్రాంచికి 6 సీట్లు ఈడబ్ల్యూఎస్ కింద భర్తీ చేస్తారు. అడ్మిషన్లలో వందశాతం కన్వీనర్ కోటాలోనే సీట్ల భర్తీ ఉంటుంది. కళాశాలలో పూర్తిస్థాయిలో అన్ని వసతులు ఉన్నాయి. ప్రతి ఏటా సుమారు 70శాతం వరకు ప్లేస్‌మెంట్ అవకాశం కల్పిస్తున్నారు. పేరొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లను క్రమంతప్పకుండా నిర్వహిస్తూ ఎంపికైన విద్యార్థినులకు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ వంటి మరో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు అనుమతుల కోసం వేచిస్తున్నారు.



స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పద్మావతి మహిళా వర్సిటీ

మహిళా వర్సిటీ, ఎస్వీయూలో ఇంజినీరింగ్‌లో సీట్ల వివరాలు

బ్రాంచ్	మహిళా వర్సిటీలో	ఎస్వీయూలో
సీఎస్ఈ	132	66
ఈసీఈ	132	66
ఈఈఈ	66	66
మెకానికల్	66	66
సివిల్	–	66
కెమికల్	–	66

ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో...

ఎస్వీయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు బ్రాంచ్‌లకు కలిపి 396 సీట్లు వంద శాతం కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నారు. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్‌లో ఒక్కో బ్రాంచ్‌లో 60సీట్ల చొప్పున భర్తీ చేస్తారు. దీంతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కింద మరో 10శాతం అంటే ఒక్కో బ్రాంచ్‌కి 6సీట్లు అదనంగా భర్తీ చేస్తారు. అదేవిధంగా లేటరల్ ఎంట్రీలో భాగంగా డిప్లొమో పూర్తిచేసి ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్ సెకండ్ ఇయర్‌లో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉంది. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్ల కోసం ప్రతి బ్రాంచ్‌లో ఆరు సీట్లు చొప్పున ఈసెట్ ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు పొందవచ్చు. ఈ కళాశాలలో విద్యనభ్యసించిన సుమారు 70శాతం మందికి పేరొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీలలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందారు.

ఈ ఏడాది సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు లేనట్టే!

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్‌తో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో ఈ ఏడాది అడ్మిషన్లను చేపట్టరాదనే నిర్ణయంతో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది ఈ కోర్సులలో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉండడంతో ఆ కోర్సులకు అడ్మిషన్లు పూర్తిగా నిలిపి వేయనున్నట్లు సమాచారం.

విద్యార్థి ఆసక్తిని బట్టి బ్రాంచ్ ఎంపిక



“ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లను తీసుకోవడం మంచిది. ఎవరో చెప్పారనో బ్రాంచ్‌ని ఎంపిక చేసుకుని చేరిన తర్వాత పూర్తి స్థాయిలో చదువుపై దృష్టి పెట్టకపోతే లక్ష్యాన్ని సాధించలేరు. ఇంజినీరింగ్‌లో ప్రతి బ్రాంచ్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. విద్యార్థి ఎంపిక చేసుకున్న బ్రాంచ్‌లో రాణిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేటివ్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి. అప్పుడే తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరు. తల్లిదండ్రులు ఫలానా బ్రాంచ్‌లోనే బీటెక్ చేయాలని అంటూ విద్యార్థులపై ఒత్తిడి చేయరాదు. విద్యార్థి అభిరుచి ఆసక్తిని పరిగణలోని తీసుకోవాలి.

–ఎం.దామోదర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తిరుపతి

టీటీడీ విభాగాలపై ఈఓ సమీక్ష

తిరుమల: టీటీడీలోని అన్ని విభాగాధిపతులతో ఈఓ జె.శ్యామలరావు సోమవారం సమీక్షించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ నరసింహ కిషోర్‌తో పాటు టీటీడీ ఉన్నతాధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, సంతృప్తి చెందేలా సేవలందించాలన్నారు. దర్శనం, వసతి, నాణ్యమైన అన్నప్రసాదాలు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను అత్యున్నతంగా అందించడం మనందరి బాధ్యత అన్నారు. ఆదివారం తన తనిఖీలో పరిశీలించినప్పుడు, భక్తుల నుంచి అందిన అభిప్రాయాలు, వారి అంచనాలను చేరుకోవడానికి మనమందరం ఇంకా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విభాగంలో చెక్ లిస్ట్, ఫీడ్‌బ్యాక్ యంత్రాంగం ఏర్పాటు చేయడంతో పాటు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లను (ఎస్ఓపీ) సిద్ధం చేయాలని ఆయన జేఈఓను ఆదేశించారు. దర్శనం, ఆన్‌లైన్ కోటా విడుదల, ఆలయానికి సంబంధించి సేవా టిక్కెట్లు, రిసెప్షన్ విభాగంలో వసతి విధానాలు, ఇంజినీరింగ్ పనులపై సంబంధిత అధికారులతో ఈఓ సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈఓ తనిఖీలు

అంతకుమునుపు టీటీడీ ఈఓ ముళ్లకుంట ప్రాంతంలోని వసతి గృహాలు, లడ్డూ కౌంటర్లను తనిఖీ చేసి భక్తుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్‌కుమార్, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, డీఎల్ఓ వీర్రాజు, సీఈ నాగేశ్వరరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం నాణ్యత గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఈఓ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చిత్తూరు కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని క్యాంపు కమాండెంట్ కల్నల్ నోయిల్ వివేక్ మోనిస్ అన్నారు. చిత్తూరులోని జిల్లా ట్రెనింగ్ సెంటర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ శిబిరం నిర్వహిస్తుండడం విధితమే. సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లతో అటవీ ప్రాంగణంలో దాదాపు 500 మంది మొక్కలు నాటినట్లు ఆయన చెప్పారు. గ్లోబల్ వార్మింగ్ మూలాన భూతాపం పెరిగిపోతోందని, అందువల్ల పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. ఆ దిశగా విరివిగా మొక్కలు నాటి సరంక్షించాలని కోరారు. మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణపైనే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్ రెడ్డి, రమేష్, మొగిలినాయుడు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ఏర్పేడు: మండలంలోని కాట్రకాయలగుంటలో బాలిక అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మండలంలోని కాట్రకాయలగుంటకు చెందిన బాలిక (16) ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. సోమవారం ఉదయం బాలిక ఇంట్లో కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

సైదాపురం: మండలంలోని తూర్పుపూండ్ల గ్రామంలో ఇటీవలన జరిగిన రాజకీయ ఘర్షణలోని కేసు లో ఓ వర్గానికి చెందిన ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ డీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో పోలీసు పహారాను ఇంకా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

గాయపడిన వ్యకి మృతి

దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని జాతీర రహదారిపై బైక్‌తో ఆవును ఢీకొని గాయపడిన బెల్లంకొండ చంద్రశేఖర్(28) సోమవారం చెన్నైలోని విజయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం తడ మండలం, మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ తన తండ్రి చెంగయ్యతో కలిసి సూళ్లూరుపేట నుంచి నాయుడుపేటకు బైక్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో డీవీ సత్రం వద్ద అడ్డంగా ఆవు రావడంతో ఢీకొని కిందపడి గాయపడ్డారు. చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని విజయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వంటింట్లో కటకట!

వంటిల్లు వట్టిపోయింది. కూరగాయలు.. పప్పు దినుసులు లేక వెలవెలబోతోంది. కొత్తిమీర, వెల్లుల్లి కనిపించని పరిస్థితి దాపురించింది. పప్పు, కూరగాయలు కలిపి తినలేని దుస్థితి నెలకొంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు రసం.. ఊరగాయతోనే సరిపెట్టుకోవాల్సిన సంక్లిష్ట పరిస్థితి ఏర్పడింది.





కొండెక్కిన కూరగాయల ధర
- నిప్పులు కురిపిస్తున్న పప్పుల ధరలు
- లబోదిబోమంటున్న సామాన్యులు
- దిగుబడి తగ్గడమే కారణమా?

తిరుపతి అర్బన్: జిల్లాలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అదీ ఇదీ అని తేడా లేకుండా అన్ని కూరగాయల ధరలు నాలుగు రోజులుగా ఆకాశాన్నంటుతున్నాయి. ఇక పప్పుల ధరలు నిప్పులు కురిపిస్తున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని.. తినలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రోజుకు రూ.500 ఖర్చు పెట్టినా సంచి నిండా కూరగాయలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెంచరీ దాటేసిన పచ్చిమిర్చి

పచ్చి మిర్చి ధర ఘాటెక్కింది. ఎండు మిర్చి ధరతో పచ్చిమిర్చి ధర పోటీ పడుతోంది. వారం రోజులుగా రూ.60 నుంచి రూ.100 మధ్య పలుకుతుండగా.. మూడు రోజుల నుంచి అమాంతం రూ.120కు చేరింది. మిగతా కూరగాయల ధరలు కూడా ఇదే స్థాయిలో ఉంటున్నాయి.

టమాట ధరలు ఆకాశానికి

వెజ్, నాన్‌వెజ్ వంటకాల్లో ప్రధానంగా టమాట ఉండాల్సిందే. అయితే ఇప్పుడు టమాటాను కొనాలంటేనే మధ్యతరగతి ప్రజలు ఆలోచించాల్సి వస్తోంది. నెల క్రితం సరైన ధర లేక రైతన్నలు పండిన పంటను రోడ్లపై పడేసి కన్నీళ్లు పెట్టుకోగా.. ఇప్పుడు ఒకింత సంతోష సాగరంలో మునిగితేలుతున్నారు.

మీసం మెలేస్తున్న కొత్తిమీర

ఆదివారం చికెన్‌లో కొతిమీర లేకుండానే సరి పెట్టుకోవాల్సిందే. ఎందుకంటే కొత్తిమీర సరఫరా తగ్గిపోవడంతో ధర కొండెక్కి కూర్చుంది. సాధారణంగా కూర గాయలు కొన్నాక కొసరన్నట్లు కొత్తిమీర అడగటం పరిపాటి. అలాంటిది ఇప్పుడు రూ.10కి కూడా ఇవ్వలేమని వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. రూ.20కి నాలుగైదు కాడల కొత్తిమీర చేతిలో పెడుతున్నారు. అదేమిటని అడిగితే.. మొన్నటి దాక కట్ట రూ.10 చొప్పన ఉంటే ఇప్పుడు హోల్‌సేల్ గానే కట్ట రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. కర్ణాటక నుంచి ఇక్కడకు చేరుకునే సరికి వాడిపోతోందని, రవాణాతో పాటు నష్టం కూడా వాటిల్లుతోందని.. అందుకే ధర పెరిగిందని అంటున్నారు. ఇక కిలో అల్లం ధర రూ.170 నుంచి రూ.180 చెబుతున్నారు.

పప్పులు.. నిప్పులు

ఇక పప్పుల ధరలు చూస్తే గుండె ఆగిపోయినంత పనవుతోంది. ఏ పప్పు దినుసు చూసినా కిలో రూ.150పైమాటే. కందిపప్పు కొనలేని స్థితికి చేరింది. దిగుమతి తగ్గిపోవడంతోపాటు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెంచేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ఆశించిన స్థాయిలోనే కూరగాయల సాగు

ప్రస్తుతం జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలోనే ఉంది. పంట దిగుబడి కూడా బాగానే ఉంది. ఇతర టమాటా.. ఇతర కూరగాయలు పక్కరాష్ట్రాలకు ఎగుమతి కూడా తగ్గిపోయింది. కానీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెంచేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో గత రబీలో 3,400 వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయల పంటలు సాగు చేయగా.. ఈ ఖరీఫ్‌లో 5,600 వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగుచేశారు. మొత్తంగా ఏడాదికి జిల్లాలో 10వేల ఎకరాల్లో కూరగాయల తోటలు సాగులో ఉంటున్నాయి.

ధరలు పెరగడానికి ప్రధాన కారణం

ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న ఓ మోస్తారు వర్షాలు కూరగాయల తోటలకు అనుకూలమే. అధిక దిగుబడి అందించడానికి దోహదపడుతున్నాయి. ఎక్కడా పంటలకు నష్టం కూడా చోటుచేసుకోలేదు. అయినప్పటికీ ధరలు వారం రోజులుగా పెరిగిపోతున్నాయి. పచ్చిమిరపకాయాలను ఒబ్బిళ్లు చేయకుండా ఎండు మిరపకాయల కోసం వదిలిపెట్టేస్తున్నారు. మరోవైపు వంకాయలు, కాకర కాయలను ఎక్కువగా చెన్నైకి ఎగుమతి చేస్తున్నారు. టమాటాను కోలార్‌కు ఎగుమతి చేస్తున్నారు. అయితే మిగిలిన కూరగాయలు పెరిగిపోవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బడా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి, కృత్రిమ కొరతను సృష్టించి రేట్లు పెంచుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిరు వ్యాపారులు ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు.

2వ తేదీన కూరగాయల ధరలు ఒక కిలో

టమాట- రూ.30	బెండకాయలు-50
కొత్తిమీర-40	దొండకాయలు-40
క్యాప్సికం-70	క్యారెట్-50
అల్లం-రూ.140	మునగకాయలు-50
గోబి-50	ఎర్రగడ్డలు-40
కాకరకాయలు-50	తెల్లగడ్డలు-180
బీరకాయలు-50	అల్లం-150
వంకాయలు-50	పచ్చిమిర్చి-80

17న కూరగాయల ధరలు

టమాటా- రూ.60-70	బెండకాయలు-80
కొత్తిమీర-70-80	దొండకాయలు-80
క్యాప్సికం-90	క్యారెట్-80
అల్లం-రూ.170-180	మునగకాయలు-60
గోబి-60	ఎర్రగడ్డలు-70
కాకరకాయలు-80	తెల్లగడ్డలు-220
బీరకాయలు-80	అల్లం-170-180
వంకాయలు-80	పచ్చిమిర్చి-120

ఈ నెల 2న పప్పుల ధర ఒక కిలో

కంది పప్పు	రూ. 150
ఉద్దిపప్పు	రూ. 110
శెనగపప్పు	రూ. 80
పెసర పప్పు	రూ. 120
వేరుశనగపప్పు	రూ. 135



ఈ నెల 17న పప్పుల ధరలు

కంది పప్పు	రూ. 190
ఉద్దిపప్పు	రూ. 140
శెనగపప్పు	రూ. 110
పెసర పప్పు	రూ. 160
వేరుశనగపప్పు	రూ. 150

జిల్లాలో ఖరీఫ్‌లో కూరగాయల సాగు

కూరగాయల రకాలు	ఎకరాల్లో
పచ్చిమిర్చి	2 వేలు
టమాట	1,500
బెండ	550
వంగ	600
ఆకు కూరలు	450
కాకరకాయలు	100
మునక్కాయలు	150
ఇతర కూరగాయల తోటలు	250
మొత్తం	5,600

ఈ స్థాయిలో ధరలు ఎప్పుడూ పెరగలేదు

కూరగాయల ధరలు ఈ స్థాయిలో ఎప్పుడూ పెరగలేదు. ఎద్దైనా ఒకటి రెండు కూరగాయాలు పెరగడం సహజమే. అయితే అన్ని కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు, పేదోళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారం రోజుల వ్యవధిలోనే పెద్ద ఎత్తున ధర పెరిగింది. మరో నెల రోజులు గడిస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం కావడం లేదు.

–ప్రభాకర్‌రెడ్డి, బైరాగిపట్టెడ, తిరుపతి

పప్పుల ధరలు కూడా పెరిగాయి

ఓ వైపు కూరగాయలు.. మరోవైపు పప్పుల ధరలు పెరిగిపోయాయి. విధిలేని పరిస్థితిలో రసం.. పెరుగుతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కొందరు వ్యాపారులు సిండికేట్ అయినట్లు తెలుస్తోంది. ఉద్ది పప్పు, కంది పప్పు, పెసరపప్పు, వేరుశనగ పప్పుల ధరను పెంచేశారు. ప్రభుత్వం వెంటనే ధరలను అదుపు చేయాలి.

–గోపాలయ్య, శ్రీకాళహస్తి

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలకమండలి రాజీనామా



రాజీనామా పత్రాలను ఆలయ ఈఓకు అందజేస్తున్న చైర్మన్, పాలక మండలి సభ్యులు

- లేఖను ఆలయ ఈఓకు అందజేసిన చైర్మన్, సభ్యులు
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకారంతో చరిత్రలో నిలిచేలా అమ్మవారి ఆలయ అభివృద్ధి
- సుమారు రూ.9 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం
- సంతోషం వ్యక్తం చేసిన చైర్మన్, పాలక మండలి సభ్యులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తన పాలక మండలి సభ్యులతో కలసి రాజీనామా పత్రాలను ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పని చేయడం సంతోషంగా ఉందన్నారు. 2022 సెప్టెంబర్‌లో కొలువుదీరిన పాలకవర్గం అనేక సంస్కరణలను తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

చెవిరెడ్డి సహకారంతో రూ.9.06 కోట్లతో ఆలయ అభివృద్ధి

రానున్న వందేళ్ల కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమ్మవారి ఆలయాన్ని పునఃనిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సమయంలో డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంపూర్ణ సహాయ, సహకారాలను అందించారని ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి గుర్తు చేశారు. గర్భాలయంతో పాటు మండపం, ఆలయ ప్రహరీ గోడ, ఆన్వేటి మండపం, దేవతా కల్యాణ మండపాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి విపత్తులు వచ్చినా, ఆలయం చెక్కు చెదరకుండా ఉండేందుకు టీటీడీ సహకారంతో రాతి ప్రహరీ గోడను సైతం నిర్మిస్తున్నామన్నారు. సుమారు రూ.9.06 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. తుడా నిధులతో అన్నదాన మండపం, మరుగుదొడ్ల నిర్మాణం, కల్యాణకట్ట, బాలాలయ మండపాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తికానున్నాయని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రెండేళ్ల పాటు అమ్మవారికి సేవలందించామని, ఆలయ నిర్మాణంలో టీటీడీ ద్వారా రూ.4 కోట్లు, దేవదాయశాఖ ద్వారా రూ.1.7 కోట్లు, తుడా ద్వారా రూ.2 కోట్లు, భక్తుల విరాళాల ద్వారా రూ.1.36 కోట్లను వెచ్చించినట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతో సుమారు రూ.10 లక్షలతో బంగారు పూత కలశాన్ని కూడా సిద్ధం చేసి, వాటిని లాకర్లలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఆగస్టులో ఆలయ కుంభాభిషేక ఉత్సవాలకు సంబంధించి దాతల ద్వారా సుమారు రూ.30 లక్షలతో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, ఇంత మంచి అవకాశం కల్పించిన డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనాలను ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలను అందజేశారు.

19 నుంచి బంగారుపేట పోలేరమ్మ జాతర

వెంకటగిరి రూరల్ : తొమ్మిదేళ్లకు ఒకసారి వచ్చే బంగారుపేట శ్రీపోలేరమ్మ తల్లి జాతర ఈనెల 19, 20 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బంగారుపేట ప్రధాన వీధులు, కూడలి ప్రాంతాల్లో శోభాయమానంగా విద్యుత్ అలంకరణలు చేపట్టారు. పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



బంగారుపేట పోలేరమ్మతల్లి



బంగారుపేట ప్రధాన వీధుల్లో విద్యుత్ కాంతులు



ప్రత్యేక ఆకర్షణగా పోలేరమ్మతల్లి, ఆలయం

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా నూతన కార్యవర్గం



సభ్యుల సమావేశం

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగ అతిథి గృహంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దేవానంద్, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రెడ్డివాణి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగటా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మంజుల ఇందిర, యువకిషోర్, బాషా, చెంగల్రాయులు, బాలచందర్, లక్ష్మీపతి, విశ్వనాథ్, సరిత పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



దెబ్బతిన్న కారు



తీవ్రంగా గాయపడిన వెంకయ్య

చిల్లకూరు : మండలంలోని వరగలి రోడ్డులో సోమవారం బైక్‌ను కారు ఢీకొంది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని చేడిమాల పంచాయతీ నల్లాయగారిపాళెం గ్రామానికి చెందిన వెంకయ్య గూడూరులోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. వరగలి రోడ్డులోని పోటుపాళెం క్రాస్ రోడ్డు వద్ద చింతవరం వైపు నుంచి గూడూరు వెళుతున్న కారు ఢీకొంది. యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు అతన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



సయ్యద్ బాబు(ఫైల్)

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఎల్ఏ సాగరం వెస్ట్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ బాబు(59) సోమవారం మృతిచెందారు. నాయుడుపేట పట్టణం ఎస్వీటీ థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న బాబు ఆదివారం రాత్రి మసీదుకు వెళ్లి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం గదిలో నిర్జీవంగా పడి ఉన్నాడని పేర్కొన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే సయ్యద్ బాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు వెల్లడించారు. ఆయన గతంలో గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నారని, గుండెపోటు రావడంతోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ బాబు మృతికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని వికృతమాల వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వికృతమాల సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

‘బాతు’ మామిడి!



ఇదిగో ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న మామిడికాయను చూస్తుంటే ఏమనిపిస్తోంది? బాతును పోలినట్టు భలే ఉంది అనుకుంటున్నారు కదూ! అవును మరి..మామిడి కాయల సీజన్‌లో ఇలా అడపాదడపా వివిధ ఆకృతుల్లో కాస్తూ ఆకర్షిస్తుంటాయి. ఇదే కోవలో తవణంపల్లె మండలంలోని ఓ రైతు తోటలో మామిడి చెట్టుకు బాతు ఆకారంలో కాయ కాయడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. – తవణంపల్లె